# పగిలిన స్వప్నం

## — పుష్పాల సూర్యకుమారి

మెడికల్ కాలేజీ క్యాంపస్ మెయిన్ గేట్ వరకూ తండ్రిని సాగనంపడానికి వచ్చాడు రాజు. తనను విడిచి వెళ్ళలేక పదేపదే వెనక్కి తిరిగి తననే ఆర్తిగా చూస్తూ గుండె భారంతో ముందుకు కదులుతున్న తండ్రిని చూచేసరికి రాజుకి ఇక దుఃఖం ఆగలేదు.. గుండె లోతుల్లో నుండి పెల్లుబికింది వరదగోదారిలా. "నాన్నా!!" ఆవేదనగా పిలిచాడు.

కన్నబిడ్డ పిలుపుకి ఆ కన్నతండ్రి అడుగు ముందుకి వెళ్ళలేదు. గిరుక్కున వెనుతిరిగి ఒక్క క్షణంలో కొడుకుని చేరుకొని ఆత్రంగా బాహువుల్లో బంధించాడు.

"నాన్నా! నేనూ నీతో వచ్చేస్తాను!" బావురుమని ఏడుస్తూ అన్నాడు రాజు.

కొడుకు మేనంతా ప్రేమగా నిమిరి, శిరస్సు మీద పెదవులతో ఆర్తిగా స్పృశించి, "వద్దు నాన్నా! నాకూడా వచ్చి అక్కడ ఏం చేస్తావు? నాతోపాటు మట్టి పిసుకుతావా? వద్దు! బుద్ధిగా చదువుకొని పెద్ద డాక్టరవై మన ఊరి ప్రజలకు నీ చేతులతో మందులివ్వాలి. రోగాలు తగ్గించాలి. బీదవాళ్ళకు ఉచితంగా సేవలు చేయాలి. చూడు! తమ్ముడు రవికి ఇరవై నాలుగ్గంటల నొప్పి వస్తే; మన ఊళ్ళో హాస్పటల్ లేక మన ప్రక్క ఊరుకి బయలుదేరుతుండగానే దారిలో చనిపోయాడు. సమయానికి ఆపరేషన్ జరగక తమ్ముడు మనకు కాకుండా పోయాడు. అందుకే తమ్ముడికి పట్టిన గతే ఎవ్వరికీ పట్టకూడదనీ, నా శక్తికి మించినదైనా నిన్ను మెడిసిన్ చదివిస్తున్నాను. నువ్వు మనసులో ఏమీ పెట్టుకోవద్దు! అయినా బాబాయ్‌గారి సురేష్ వున్నాడుగా నీకు తోడుగా. నీకిక భయమేమిటి?" అని కొడుక్కి హితవు చెప్పి రాజు ప్రక్కగా నిలుచుని వున్న సురేష్ వైపు తిరిగి "ఒరేయ్! రాజుకి నువ్వే ధైర్యం చెప్పాలిరా! మీ ఇద్దరూ సొంత అన్నదమ్ముల్లా ఒకరికొకరు తోడుగా, నీడగా వుండాలి!" అన్నాడు ప్రాధేయపూర్వకంగా సోమనాథం.

"పెదనాన్నా! ఒకే ఊళ్ళో ప్రక్క ప్రక్క ఇళ్ళల్లో వుంటున్నాం. ఆ మాత్రం ఒకరికొకరు సాయం చేసుకోలేమా! రాజుని కంటికి రెప్పలా చూసుకొంటాను. నేనున్నానుగా. నువ్వు ధైర్యంగా వెళ్ళవచ్చు!" అంటూ బరోసా ఇచ్చాడు సురేష్.

సోమనాథం సురేష్ వైపు కృతజ్ఞతగా చూసి చిరునవ్వు నవ్వాడు. రాజు వైపు తిరిగి ధైర్యం చెబుతున్నట్లుగా భుజం మీద చేత్తో తడుతూ "అయితే నేనిక వస్తానయ్యా! రాజూ! అప్పుడప్పుడూ ఉత్తరాలు వ్రాస్తుండు!" అని చెప్పి గబగబా అంగలు వేసుకొంటూ గుండె రాయిచేసుకొని ముందుకు కదిలాడు సోమనాథం... తాను ఇంకా సేపు అక్కడ వుంటే కొడుకు దుఃఖం ఎక్కువవుతుందే కానీ, తగ్గదు అన్న తలంపుతో.

వెడుతున్న తండ్రి వైపు జాలిగా చూస్తూ నిశ్శబ్దంగా రోధిస్తున్న రాజు భుజం మీద చెయ్యి వుంచి ధైర్యం చెప్పసాగాడు సురేష్.

"ఒరేయ్ రాజూ! ఊరుకోరా! ఫీజు కట్టిన తరువాత మీ నాన్నకూడా వెళతానంటావేమిటి? నీ కిక్కడ చదవడం ఇష్టంలేకపోతే ముందే చెప్పవలసింది. ఫీజు కట్టడం మానేసేవాడుగా!" అన్నాడు సురేష్.

"చమటోడ్చి, రక్తం ధారపోసి, కష్టపడి సంపాదించుకున్న పంటచేలను నా మెడిసిన్ చదువు కోసం అమ్మి ఫీజు కట్టాడు. నా ఆశయం తీర్చడం కోసం నాన్న ఇంత త్యాగం చేస్తుంటే నా మనసు బాధతో విలవిల్లాడిపోతుందిరా!" ఆవేదనగా అన్నాడు రాజు.

"మన అదృష్టం కొలదీ మనను కన్నవాళ్ళు మనకు బంగారు భవిష్యత్తునిచ్చారు. మనం అది సద్వినియోగం చేసుకొని వారి బంగారు కలలను పండించాలిరా! పిచ్చి పిచ్చి ఆలోచన్లు మాని చదువు మీద దృష్టి మరల్చు!" అంటూ సురేష్ మిత్రుడ్ని ఓదార్చే ప్రయత్నం చేశాడు.

xxx

కాలచక్రం ఆరు సంవత్సరాల్ని ఇట్టే గిరగిరా తిప్పేసింది. రాజు తన తమ్ముడు రవి పేరు మీదుగా "నర్సింగ్ హోమ్" కట్టించి ప్రాక్టీస్ పెట్టుకొన్నాడు.

ఆ రోజు సోమనాథం చేలో పండిన ధాన్యాన్ని బండ్ల మీద షావుకారింటికి తోలించి, ఇంటిముఖం పట్టాడు.

సరిగ్గా అప్పుడు జడ్జి రామనాథంగారి అంబాసిడర్ కారు సోమనాథాన్ని దాటుకొంటూ వెళ్ళి, వెంటనే రివర్సయి అతడికి దగ్గరగా వచ్చి నిలచింది.

కారులో నుంచి జడ్జిగారు విండో ఇవతలకు తల పెట్టి "ఏమయ్యా! సోమనాథం! బావున్నావా?!" చిరునవ్వుతో అడిగారు.

సోమనాథానికి ఇది కలా, నిజమా అనిపించింది. ఎప్పుడయినా తనబోటివాళ్ళు కోర్టు కెళ్ళినప్పుడు "నమస్కారమండయ్యా!" అని దండాలు పెడితే కనీసం తన ముఖం వైపన్నా కన్నెత్తి చూడని ఈయన ఈ రోజు ఇంత ఆప్యాయంగా పలకరించేసరికి హతాశుడయ్యాడు. నోట మాట రాలేదు.

"ఏంటయ్యా! అలా చూస్తున్నావు? ముందు కారెక్కు!" చొరవగా అంటూ తానే కారు డోర్ తెరిచారు.

"వద్దండీ! జడ్జిగారూ! నేను నడిచే వెడతాను!" ఇబ్బందిగా అన్నాడు.

ఫర్వాలేదయ్యా! ఎక్కు! అంత మొహమాటం పడిపోతావేంటి? అంటూ బలవంతంచేశారు.

ఇక సోమనాథానికి ఎక్కక తప్పలేదు. ఎక్కి బిడియంగా ఓ ప్రక్కగా ఒదిగి కూర్చున్నాడు. కారు ముందుకు కదిలింది.

"మీ అబ్బాయి అందొచ్చాడు కదా! ఈ వయస్సులో నీ కెందుకయ్యా ఈ పొలం పనులు?" కాస్త మందలింపుగా అన్నారు.

"మా రాజుబాబూ! అదే కేకలు వేస్తుంటాడండి! కానీ, అలవాటైన పన్లు, ఖాళీగా వుండలేక వెడుతుంటాను. ఒక్కరోజు పొలం వెళ్ళకపోతే నాకు తోచదు!" చెప్పాడు సోమనాథం.

"మీ అబ్బాయి ప్రాక్టీస్ పెట్టిన కొద్ది రోజుల్లోనే

ప్రజల మనస్సుల్లో మంచి డాక్టరుగా ముద్రింపబడ్డాడు. మన ఊళ్ళో జనమంతా మీ అబ్బాయి హస్తవాసి మంచిదనీ, దేవుడనీ, ధర్మరాజు అనీ, ఇంకా ఏదేదో గొప్పగా చెప్పకొంటున్నారు. నాకు ఒకసారి చూడాలని వుంది. పరిచయం చేయరాదూ!" ఆసక్తిగా అడిగారు.

జడ్జిగారి లాంటి పెద్దవాళ్ళు తన కొడుకు గొప్పతనాన్ని పొగడడం, చూడాలని వుందని తనని అడగడం, ఇదంతా అతడికెంతో గర్వంగా అనిపించింది. మనసులో ఉబ్బితబ్బిబ్బయిపోతూ "తప్పకుండానండీ! ఇప్పడే వెళదామాండీ హాస్పటల్‌కి!" గబగబా అడిగాడు.

"సరయితే ఇప్పడే వెడదాం!" సోమనాథంతో అని, డ్రైవర్ వైపు తిరిగి కారును హాస్పటల్‌కి పోనిమ్మని అడ్రస్ చెప్పారు.

అయిదు నిమిషాల తరువాత మళ్ళీ జడ్జిగారే "సోమనాథం! ఒక విషయం అడగాలనుకొంటున్నాను. ఏమీ అనుకోవుగా?" ప్రశ్నించారు.

"అడగండి!"

"మీ అబ్బాయి మంచితనాన్ని గురించి విన్న తరువాత నీతో వియ్యం అందుకోవాలని ఉందయ్యా!" చెప్పారు జడ్జిగారు.

ఆ మాటలు వింటూనే సోమనాథం అంతరంగం ఒక్క క్షణం ఆనందంతో ఉవ్వెత్తున లేచింది. ముఖం విప్పారింది. ఆశ్చర్యంతో నోట మాట రాలేదు. తనబోటివాడు జడ్జీగారితో వియ్యమందడమంటే మాటలా? జడ్జిగారు హాస్యానికి అనలేదు కదా. ఒకింత అనుమానం కూడా కలిగింది.

"ఏంటయ్యా! మాట్లాడవు? నీ కిష్టం లేదా?!" అడిగారు.

తడబడుతూ, "అబ్బెబ్బే! అది కాదండీ, మీ అంతస్తుకు మేం సరిపోమనీ!" సందేహంగా చూస్తూ అన్నాడు సోమనాథం.


"అంతస్తులతో పనేమిటి? అయినా మీకేం తక్కువనీ? కులం తక్కువా, జాతి తక్కువా? డబ్బు ఇవాళ వుంటుంది, రేపు పోతుంది. డబ్బు ఎప్పడయినా సంపాదించుకోవచ్చు. కాని, మంచి మనసులున్న మనుషులతో బంధుత్వం దొరకొద్దూ? మీది మంచి కుటుంబం అని మాకు బాగా తెలుసు. మా అమ్మాయిని చూసావుగా?" అడిగారు.

"మీ అమ్మాయిగారాండీ! కుందనపు బొమ్మలాగా ఉంటారండీ!" చెప్పాడు సోమనాథం.

"అయితే ఏమంటావు?"

"మీతో సంబంధం అందుకోవడం నిజంగా మా అదృష్టమండి! కానీ, మా బాబుతో ఒక్క మాట చెప్పి వాడిష్టాన్ని కూడా తెలుసుకోవాలి కదండీ!" అన్నాడు.

"మీ అబ్బాయి అంగీకారం తెలుసుకున్న తరువాతే మనం మిగతా విషయాలు మాట్లాడుకొందాము. రెండు రోజుల్లో మీ ఇంటికొస్తాను. ఈ లోగా మీ అబ్బాయి ఇష్టాన్ని తెలుసుకో!" అని జడ్జిగారు అంటూవుండగానే కారు హాస్పిటల్ క్యాంపస్‌లోకి వచ్చి ఆగింది. ఇద్దరూ కారు దిగి హాస్పిటల్ కారిడార్‌లోకి ప్రవేశించారు.



న్యూజెర్సీ కళాసమితి, ఆంధ్రజ్యోతి సచిత్రవారపత్రిక సంయుక్తంగా నిర్వహించిన '97 కథల పోటీలో సాధారణ ప్రచురణకు ఎంపికైన కథ

కారిడార్‌లో ఓ పదిమంది పేషెంట్లు చెక్కబెంచీ మీద కూర్చుని డాక్టర్ కోసం వేచివున్నారు. సోమనాథం దృష్టి వాళ్ళ వైపు మళ్ళింది. వాళ్ళంతా సోమనాథం పొలంలోకి పన్లకు వస్తుంటారు. రెక్కాడితేగాని డొక్కాడని బ్రతుకులు వాళ్ళవి. "ఏంటి రంగన్నా! ఇలా వచ్చావు? ఒంట్లో బాగాలేదా?" అడిగాడు సోమనాథం ఆప్యాయంగా.

"మా చంటిదానికి జ్వరమండి బాబా! మూసిన కన్ను తెరవడం లేదు. పొద్దుననగా వచ్చామండి. ఇంత యేళయినా డాక్టర్ బాబు దర్శనం కానేలేదు" అసహనంగా అన్నాడు రంగన్న.

"ఏమైనా అర్జంటు కేసులు చూస్తున్నాడేమో!" సమర్థింపుగా అన్నాడు సోమనాథం.

"అయినా మాలాంటి బీదోళ్ళని ఎవరు పట్టించుకొంటారు బాబూ! మా కంటే వెనకాలొచ్చిన ప్రెసిడెంటుగారి తాలూకు మనుషులను లోపలకు తీసుకెళ్ళి పరీక్షలు చేస్తున్నారు!" విషాదంగా అన్నాడు రంగన్న.


సోమనాథం మనసు చివుక్కుమంది. తన ఆశయం బీదవాళ్ళకు సేవలు చేయాలనే కదా కొడుకుని డాక్టర్ని చేసిందీ? ఇప్పడు వీడు చేస్తున్న పనేమిటి? లోలోన ప్రశ్నించుకొని, ఆ విషయమే గట్టిగా కొడుకుని అడగదలుచుకున్నాడు.

సరిగ్గా అప్పడే రాజు రౌండ్స్‌కి వెళ్ళి ఇటే వస్తున్నాడు. తెల్లని కోటులో, మెడలో స్టెతస్కోప్‌తో హుందాగా నడచివస్తున్న రాజుని ఒక్క క్షణం కన్నార్పకుండా చూసారు జడ్జిగారు.

తండ్రిని చూడగానే అతడి పెదవులపై చిరునవ్వు మెరిసింది. తండ్రికి దగ్గరగా వచ్చి "ఏమిటి నాన్నా! ఇంత ఎండలో వచ్చావు? అర్జంటు పనేమైనా వుందా?!" మృదుమధురంగా అడిగాడు రాజు.

"ఏమీ లేదూ! వట్టినే వచ్చాను! అవునూ వీళ్ళు ఉదయమనగా వచ్చారట... ఇంతవరకూ వీళ్ళను పట్టించుకోకుండా ఏం చేస్తున్నావు? నిన్ను డాక్టర్ని చేసింది బీద ప్రజలకు వైద్యం చేస్తావనే కదా!" ఆవేశంగా అడిగేశాడు సోమనాథం.

రాజు తండ్రి వైపు తెల్లబోయి చూశాడు. "నాన్నా! నేనెలాంటి వాడినో నీకు తెలియదా? నీ ఆశయం నేనెప్పుడూ మరువను. నీ లక్ష్యాన్ని నెరవేర్చడమే నా విధి! ఈ రోజు ఉదయాన్నే మన ప్రెసిడెంట్‌గారి తాలూకు వాళ్ళవి రెండు డెలివరీ




కేసులు వచ్చాయ్! రెండూ చాలా సీరియస్ కండిషన్లో వుంటే సిజేరియన్లు చేయవలసి వచ్చింది. ఆ కేసులు రెండూ చూసుకొని రౌండ్సకి వెళ్ళి ఇటు వస్తున్నాను!" మన్నితంగా వివరించాడు రాజు.

సోమనాథం కళ్ళల్లో గర్వం, ఆనందం తాలూకు మెరుపు మెరిసింది. "బాబూ! నిన్ను అనవసరంగా అపార్థం చేసుకున్నానురా!" రాజు చేతులు పట్టుకొన్నాడు.

"ఫర్వాలేదు! నాన్నా! నేను ఒకవేళ తప్పచేస్తే మందలించే అధికారం నీకుంది!" మృదువుగా అన్నాడు రాజు.

జడ్జిగారు ఆ తండ్రీకొడుకుల సహృదయతనూ, ఔన్నత్యాన్నీ మనసులోనే కొనియాడారు.

"ఈయనెవరు నాన్నా!" జడ్జిగారి వేపు ప్రశ్నార్థకంగా చూస్తూ అడిగాడు రాజు.

"ఈయన ఎవరనుకొంటున్నావు? మన జిల్లా జడ్జిగారు బాబూ! నిన్ను చూడాలని వుందన్నారు. తీసుకొచ్చాను!" అంటూ జడ్జిగార్ని పరిచయం చేశాడు.

"నమస్తే సార్!" రెండు చేతులెత్తి వినయంగా నమస్కరిస్తున్న రాజుని విస్ఫారిత నేత్రాలతో చూశారు జడ్జిగారు. ఆ నిలుచున్న తీరులో వందనం, మాట్లాడిన తీరులో సౌమ్యం కొట్టవచ్చినట్టు అగుపిస్తోంది. అందమైన ముఖవర్చస్సు, సమానమైన వళ్ళూ, హైటు, తన కూతురు రోజాకి సరైన జోడీ! సంతృప్తిగా ఫీలయ్యారు. ప్రతి నమస్కారంగా "నమస్తే! ప్రాక్టీస్ ఎలా వుందీ?!" అడిగారు.

"చాలా బాగుందండీ!!" సంతృప్తిగా అన్నాడు రాజు.

"ఊ ! మరైతే పి.జి. చేస్తావా?" కుతూహలంగా అడిగారు.

"ఆ ! ఎం.ఎస్. చేయడానికి ప్రిపేరవుతున్నానండీ! ఆ తరువాత ఎం.సిహెచ్. కూడా చేయాలనుకొంటున్నాను" ఉత్సాహంగా చెప్పాడు రాజు.

"వెరీగుడ్ ఐడియా! చాలా చురుకైన వాడివి. భవిష్యత్తులో పైకొస్తావు! ఎంతో పుణ్యం చేసుకోబట్టి మీ నాన్న నీలాంటి ఉత్తముడ్ని కన్నాడు!" అభినందిస్తూ రాజు భుజం మీద చేత్తో ఆప్యాయంగా తట్టారు.

"వాళ్ళు కాదండీ! నేనే ఎంతో పుణ్యం చేసుకోబట్టి మా అమ్మా, నాన్నకు పుత్రుడనయ్యాను. నా జీవితానికి బంగారు బాటలు వేసింది నా మాతాపితలు!" తల్లిదండ్రుల ఔన్నత్యాన్ని విశేషించి చెబుతున్న రాజు వేపు అభినందనపూర్వకంగా చూశారు జడ్జిగారు.

"సోమనాథం! నీ కొడుకులాంటివాళ్ళు ఈ రోజుల్లో అరుదయ్యా! మేలిమి బంగారాన్ని కన్నావయ్యా! మరిక వెడదామా!?" అడిగారు సోమనాథం వైపు తిరిగి.

"మీ కెందుకండీ అనవసరంగా శ్రమ! మా నాన్న నా కారులో వస్తాడులెండి!" ఇబ్బందిగా అన్నాడు రాజు.

"సరే! అయితే ఇక నేను వస్తాను!" ఇద్దరికీ చెప్పి జడ్జిగారు వెళ్ళిపోయారు.

ఆ కారిడార్లో కూర్చున్న పేషంట్లు అందరినీ చూడడం అయిన తర్వాత రాజు తండ్రితో తన మారుతీకారులో ఇంటికి బయలుదేరాడు.

దారిలో సోమనాథం "బాబూ! నీకీ సంవత్సరం పెళ్ళి చేసేయాలని అనుకొంటున్నాం. ఏమంటావు?" అడిగాడు.

"నా పెళ్ళికి ఇప్పడేం అంత కంగారొచ్చింది నాన్నా!" డ్రైవింగ్ చేస్తూ అడిగాడు రాజు.

"నీకు కంగారు లేకపోవచ్చు. మాకు కంగారుగానే వుంటుంది. కోడలు, ఆ తరువాత మనుమలతో ఇల్లు కళకళలాడుతుంటే మా కెంత ఆనందమో నీకేం తెలుసు? ఇందాక జడ్జిగారు కారులో వస్తుంటే అడిగారు... వాళ్ళమ్మాయిని నీ కిచ్చి పెళ్ళిచేస్తారట. ఏమంటావు?" అడిగాడు సోమనాథం.

రాజు త్రుళ్ళిపడ్డాడు. "ఏమిటీ? వాళ్ళతో వియ్యమా!? వాళ్ళ అంతస్తుకు మనం దేనితో సరిపోతాము. దేనికయినా సమవుజ్జీ వుండాలి నాన్నా! నీకు చెప్పేటంతటివాడ్ని కాదుకానీ, ఇది అత్యాశేమో అనిపిస్తోంది!" అన్నాడు గబగబా.

"నీలాంటి ఉత్తముడ్ని అల్లుడిగా చేసుకోవాలని ఆయన తెగ తాపత్రయపడుతున్నారు. అమ్మాయి కుందనపు బొమ్మలా వుంటుంది. లక్ష్మీదేవి వరించి వస్తుంటే మోకాళ్ళు అడ్డుపెట్టడం అవివేకమే అవుతుంది. మన సంబంధం కావాలని, వాళ్ళు వచ్చి అడిగినప్పుడు తిరస్కరించడం భావ్యమా?!" కాస్త నిష్ఠూరం ధ్వనించింది తండ్రి మాటల్లో. రాజు తండ్రి వేపు. కంగారుగా చూశాడు.

"అదికాదు నాన్నా! వచ్చినమ్మాయి మనింట్లో ఎడ్జస్ట్ అవ్వకపోతే తరువాత మనమే బాధపడాలి!" అన్నాడు రాజు.

"నీ మంచి కోరి చెబుతున్నాను. ఈ సంబంధం చేసుకుంటే నీకు సంఘంలో గౌరవ మర్యాదలు పెరుగుతాయని తండ్రిగా నా ఆకాంక్ష! నా మాట విను బాబూ!" కొడుకు నుంచి జవాబుకై ఆశగా చూశాడు.

"క్రొవ్వొత్తులా నీ జీవితాన్ని కరిగించి, నా జీవన గమ్యానికి కాంతిపుంజానివయ్యావు! అనుక్షణం నా మంచిని ఆకాంక్షించే నీలాంటి తండ్రి లభించడం నిజంగా అది నా అదృష్టం! నీ ఇష్టమే నా ఇష్టం!" తన అంగీకారాన్ని వ్యక్తపరిచాడు రాజు. కొడుకు అంగీకారాన్ని విన్న సోమనాథం సంతృప్తిగా గాలి పీల్చుకున్నాడు.

ఓ రెండు రోజుల తరువాత జడ్జిగారు సోమనాథం ఇంటికొచ్చారు. ఇద్దరి మధ్యా ఇచ్చిపుచ్చుకోవడాలు మాటలు జరిగిన తరువాత ముహూర్తాలు నిర్ణయించుకున్నారు.

కళ్యాణమండపం కళకళలాడుతూ వెలిగిపోతోంది. కన్యాదానం అవ్వగానే జడ్జిగారి దంపతులు వేదిక దిగి వచ్చి అప్పటికే వచ్చివున్న గెస్ట్లందర్నీ చిరునవ్వుతో రిసీవ్ చేసుకొంటున్నారు. రాజు పెళ్ళికూతురు మెడలో మంగళసూత్రం కట్టి, ఆమెకు అతి దగ్గరలో కూర్చుంటూ... ఆమె చెవిలో ఏదో కొంటెగా గుసగుసలాడాడు. రోజా చెక్కిళ్ళు సిగ్గుతో కెంపులయ్యాయి. ఓరకంటితో రాజుని చూస్తూ వచ్చే నవ్వును మునిపంట నొక్కిపెడుతోంది. ఈసారి ఆమె నెత్తిమీద తలంబ్రాలుంచుతూ చిలిపిగా నవ్వుతూ ఏదో ప్రశ్న వేశాడు. ఆమె చిరునవ్వే సమాధానంగా అతడి కళ్ళలోకి ఒక్క క్షణం చూసి, గబుక్కున అతడి నెత్తిమీద తలంబ్రాలుంచి తల దించుకుంది.

ఆ దృశ్యాన్ని చూస్తున్న సోమనాథం తరపు బంధువులు "అమ్మో! ఏమో అనుకున్నాం. నీ కొడుకు గడుసువాడే? పెళ్ళిపీటల మీదే పెళ్ళికూతురుతో కొంటెమాటలు ఆరంభించాడు!" నవ్వుతూ అంటూ సోమనాథం వైపు చూశారు.

సోమనాథం కొడుకునీ, కోడల్నీ తనివితీరా

సంతృప్తిగా చూసుకుని, ముసిముసిగా నవ్వుకుని, "మన కాలం మనుషులు వేరు. ఈ కాలం పిల్లలు కదా కాస్త స్పీడు!" అంటూ సమర్థించాదు.

పీటల మీద నుంచి దిగివచ్చి కొడుకూ, కోడలూ సోమనాథం కాళ్ళకి భక్తితో నమస్కరిస్తున్నారు. సోమనాథం వారి శిరస్సులపై అక్షింతలుంచి ఆశీర్వదించి, పెండ్లికొచ్చిన ఆడవాళ్ళతో మాటల్లో పడిన భార్యను "సుభద్రా! సుభద్రా! కొడుకూ, కోడలిని ఆశీర్వదించు!" ఆదేశిస్తున్నాడు.

సుభద్రమ్మ భర్త వేపు విస్మయంగా చూడసాగింది.

మళ్ళీ "సుభద్రా! సుభద్రా! కొడుకునూ, కోడలినీ ఆశీర్వదించవే! అక్షింతలు తీసుకో!" గట్టిగా పిలుస్తున్నాడు.

ఈసారి సుభద్రమ్మకు భర్తను చూస్తే నిజంగానే మతిపోయినట్టయింది. భర్త మంచానికి దగ్గరగా వెళ్ళి తట్టి లేపి "ఏవండీ! ఏవండీ!" పిలిచింది.

భార్య పిలుపుతో దెబ్బతో నిద్రమత్తు వదిలిన సోమనాథం ఒక్క ఉదుటున లేచి కూర్చుని కళ్ళు నులుముకుంటూ పరిసరాల్ని పరికించసాగాడు. "ఏమిటీ? ఇది మన ఇల్లా!? కళ్యాణమండపం కాదా? అంటే ఇందాకట్నుండీ ... నేను... చూసింది... " అంటూ అర్థోక్తిలో ఆగిపోయాడు.

"ఇది మన ఇల్లే! కళ్యాణమండపం కాదు. ఏదో కలగని వుంటారు అవునా?" ఆరాగా అడిగింది భార్య.

"అవునే సుభద్రా! అందమైన కలగన్నాను. ఆ కల ఎలా వుందనుకొన్నావు? ఆ టేబుల్ మీదుంది చూడు! అద్దాల్లో బిగించి రకరకాల రంగుల నగిషీలతో మెరిసిపోతున్న 'తాజ్‌మహల్లాంటి' కలగన్నాను!" అంటూ తన కొచ్చిన స్వప్న వృత్తాంతాన్ని భార్యకు వివరించాదు.

అంతా విన్న తరువాత సుభద్రమ్మ పగలబడి నవ్వింది. "కొడుకుని విడిచిపెట్టి వచ్చి నాలుగు రోజులైనా కాలేదు. అప్పుడే వాడు డాక్టరై వచ్చినట్టు, పెళ్ళయిపోయినట్టు, జడ్జిగారి వంటి పెద్దోళ్ళతో వియ్యమందుకున్నట్టు కలలు కనేసారన్నమాట! కలలు ఎప్పుడూ అందంగానే వుంటాయి. కానీ, వాస్తవంలోకొచ్చేసరికి అవి నెరవేరడం కల్ల! పెద్దింటోళ్ళతో సంబంధాలు మనకొద్దు... అటువంటి కోరికల్ని తుడిచిపెట్టండి!" అంది సుభద్రమ్మ.

"మనవాడు డాక్టరయిన తరువాత సంఘంలో మనకెంత గౌరవప్రతిష్ఠలు పెరుగుతాయో నీకేం తెలుసు. నా కొడుక్కి జడ్జిగారే కాదు, కలెక్టర్ కూడా వచ్చి పిల్లనిస్తానని బ్రతిమాలతాడు తెలుసా?" దర్పంగా అన్నాడు.

"లేవండి! లేవండి! ముఖం కడుక్కొని చేలోకి వెళ్ళండి! వీధి అరుగుమీద చెంబుతో నీళ్ళు, వేపపుల్లా పెట్టాను!" అంటూ వీధి వాకిట్లోకి వెళ్ళింది ముగ్గుచిప్ప పట్టుకొని సుభద్రమ్మ.

సోమనాథం మంచం మీద నుంచి లేచి వీధిలోకొచ్చాడు. మెట్టు చివరగా కూర్చుని వేపపుల్ల అందుకొని, నోట్లో పెట్టి బాగా నమిలి అటూ ఇటూ పళ్ళను తోమి, ఉమ్మి ఊస్తూ, ముగ్గు వేస్తున్న భార్యతో "సుభద్రా! రేపు నీ కొడుకు డాక్టరయితే ఈ పాచిపన్లు నువ్వు చేసుకోనక్కర్లేదు. ఇంటనిండా బోల్డు మంది నౌకర్లు!" అన్నాడు.

"చాల్లెండి! ముందు ముఖం కడగండి! కాఫీ కాచిపెట్టాను. చల్లారిపోతుంది" విసుక్కొంది.

సోమనాథం ముఖం కడగడం అయిందనిపించి భుజం మీద కండువాతో ముఖం అత్తుకొంటూ అప్రయత్నంగా తమ ఇంటి గేటు వేపు చూశాడు. సరిగ్గా అదే సమయంలో అంబులెన్స్ వచ్చి ఆగింది తన ఇంటి గేటు దగ్గర. అతడి భృకుటి ముడివడింది. నివ్వెరబోయి చూస్తూ విషయం ఏమిటో తెలుసుకుందామని మెట్లు దిగుతున్నాడు.

అప్పటికే ఓ నలుగురు వ్యక్తులు అంబులెన్స్‌లో నుంచి స్ట్రెచర్ దింపి, సోమనాథం వీధి వాకిట్లోకి తీసుకొచ్చి క్రింద వుంచడం జరిగింది. స్ట్రెచర్ మీదున్న వ్యక్తి ఎవరో తెలియట్లేదు. తెల్లని దుప్పటి కప్పబడి వుంది. సుభద్రమ్మ కొయ్యలా అయిపోయింది. చేతిలో ముగ్గుచిప్ప జారిపోయింది.

సోమనాథం తెల్లబోయి చూస్తున్నాడు విషయం అర్థంకాక. గుండె దడదడా కొట్టుకొంటుంది. స్ట్రెచర్ దగ్గర శోకమూర్తిలా నిలుచున్న సురేష్ వైపు ప్రశ్నార్థకంగా చూస్తూ "సురేష్! ఏమిట్రా ఇదీ! ఎవరూ?" ఆతృతగా అడిగాడు.

"పెదనాన్నా! మన రాజు... మనకిక లేదు... కడసారి నిన్ను చూడ్డానికి ఈ రూపంలో వచ్చాడు" చెప్పడం ముగించాదు సురేష్.

అంతే సోమనాథం మొదలు నరికిన చెట్టులా శవం పక్కన కూలబడిపోయి శవం మీద దుప్పటి లాగి "రాజూ!!" గావుకేక పెట్టాడు. సుభద్రమ్మ కొడుకు శవం మీద పడి బావురుమంది.

"రాజు బాబూ! నాన్నా! నాతో ఒక్కసారి మాట్లాడవూ? నీకీ గతి ఎందుకు పట్టిందిరా?" పిచ్చివాడిలాగా కొడుకు ముఖంలోకి చూస్తూ అడుగుతున్నాడు సోమనాథం.

"ఒరేయ్! సురేష్! అసలు ఏం జరిగిందో విషయం చెప్పరా?" సురేష్ తండ్రి అడిగాడు.

"మా కాలేజీలో ర్యాగింగ్ వెర్రితలలు వేస్తోంది" చెప్పాడు సురేష్.

"ర్యాగింగ్ అంటే?" అడిగాడు సురేష్ తండ్రి.

"జూనియర్స్‌ని సీనియర్స్ ఏడిపించడం ... మాట! నైతిక విలువలను మంటగలిపి "ర్యాగింగ్" పేరుతో సహవిద్యార్థులను అమానుషంగా వేధించడం. వాళ్ళకదో పైశాచిక ఆనందం! మా కాలేజీలో సీనియర్స్ మన రాజు వంటి మీద బట్టలు బలవంతంగా ఊడబెరికి, ఒక గులాబీ పువ్వు చేతికిచ్చి, "ఇలా నగ్నంగా వెళ్ళి అమ్మాయిలకిచ్చిరా!" ఆజ్ఞాపించారు. ఆ పని చేయడానికి రాజు నిరాకరించాదు. బ్రతిమాలాడు, కాళ్ళావేళ్ళాపడ్డాడు. ఏడ్చాడు. అయినా ఆ మూర్ఖులు కరగలేదు. రాజుని వేధించడం ఆరంభించారు. తప్పనిసరి పరిస్థితుల్లో రాజు నగ్నంగా పరుగెత్తుకెళ్ళి ఆ గులాబీ పువ్వు అమ్మాయిలకిచ్చి వచ్చి తన రూమ్‌కెళ్ళి తబ్బున తలుపులు మూసుకున్నాడు. అలా మూసుకున్న తలుపులు నిన్న సాయంకాలం వరకూ తెరచుకోలేదు. నాకూ, మా ఫ్రెండ్స్‌కీ అనుమానమొచ్చి తలుపులు బ్రద్దలు కొట్టాము. ఇంకేముందీ అవమానాన్ని భరించలేక ఆత్మాభిమానం గల రాజు ఫ్యాన్‌కి తాడుగట్టి మెడకు బిగించుకొని బలవంతంగా ప్రాణాలు తీసుకున్నాడు!" అంటూ విషయమంతా నివృత్తిచేశాడు సురేష్.

"రాజూ! ఆ నరరూప రాక్షసుల కిరాతకాలకు నీ నిండు ప్రాణాన్ని బలిగొన్నావా? నీకు నూరేళ్ళూ నిండిపోయాయా నాన్నా! మెడలో స్టెతస్కోప్‌తో దర్శనమిస్తావనుకుంటే, మెడలో ఉరి త్రాడుతో దర్శనమిచ్చావా? ఇక మాకు ఏం మిగిలిందిరా బ్రతకడానికి. నీ దగ్గరకే వస్తాము... మాకు చావు ఒక్కటే శరణ్యం!" దగాపడిన తండ్రి గొంతు సప్తసముద్రాల ఘోషమై ఆక్రందిస్తోంది.

ఊహల పల్లకి కూలిపోగా, అందమైన స్వప్నం పగిలిపోగా, కొడుకు చనిపోయిన షాక్‌తో ఆ ముదుసలి తండ్రికి మతిభ్రమించి, వెర్రి చూపులతో పగలబడి నవ్వుతూ, ఏడుస్తున్న భార్యతో "ఓసి పిచ్చిదానా! ఎవరో చచ్చినట్టుగా ఎందుకే ఏడుస్తావు? మన రాజు చచ్చిపోయాడని ఎవరు చెప్పారు? వట్టిదే. ఆ మాటలు నమ్మకు. మన ప్రక్క రాష్ట్రానికి చదువుకోడానికి వెళ్ళాడుగా. పెద్ద డాక్టరై వస్తాడు... ఒక్క ఆరు సంవత్సరాలు ఓపిక పట్టు. తెల్లని కోటు వేసుకుని, హుందాగా మహారాజులా వస్తాడే!" అంటూ ఓదారుస్తున్న భర్తను ఒక్క క్షణం విస్మయంగా చూసింది సుభద్రమ్మ. భర్తకు మతిభ్రమించిందని గ్రహించి అతడిని పట్టుకొని బావురుమంది.

## 'అమ్మ చెప్పింది!'

"నిజం చెప్పు! నీకు వంట చేయడం వచ్చా?" ప్రశ్నించాడు పెళ్ళి కొడుకు.

"డోంట్ వర్రీ డార్లింగ్! నాకు మా అమ్మ అంతా చెప్పింది"

"ఏం చెప్పింది?"

"నీకు వంట బాగా వచ్చని".

-ఘంటా రాఘవ రెడ్డి